సాక్షి
కర్నూలు
గురువారం । 15 । మే । 2025




మల్లన్నకు నృత్య నివేదన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథంలో భాగంగా నిత్య కళావేదికపై బుధవారం కడపకు చెందిన డి.తిరుపతి, బృందం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.



సాక్షి గణపతికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు.



అక్రమ రవాణా.. అడ్డుకుంటే ఒట్టు!

తుంగభద్ర నది నుంచి ట్రాక్టర్లతో ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. అక్రమ రవాణాతో విసుగెత్తిన ప్రజలు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం. 8లో▸

న్యూస్‌రీల్

టెండర్ దశలో డీఎంఎఫ్, నాబార్డు పనులు



వి.రామచంద్రారెడ్డి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో డీఎంఎఫ్(2024–25), నాబార్డు ఆర్ఐడీఎఫ్ (2025–26) నిధులతో చేపట్టనున్న రోడ్ల పనులు టెండర్ దశలో ఉన్నాయని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీరు వి.రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రజలకు పూర్తి ఇబ్బందిగా ఉన్న రోడ్లను ఎంపిక చేసి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించామన్నారు. ఈ నేపథ్యంలోనే కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 29 రోడ్లు, ఒక బిల్డింగ్ పనికి సంబంధించి రూ.42.58 కోట్లతో పాలనా అనుమతులు వచ్చాయన్నారు. పనులను ప్రారంభించేందుకు ఈ నెల 9నుంచి 23వ తేది మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలు చేసేందుకు సమయం ఇచ్చారన్నారు. టెండర్ల ప్రక్రియ ముగిసిన వెంటనే 23వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు టెక్నికల్ బిడ్స్‌ను.. 26న ఉదయం 11 గంటలకు ఫైనాన్సియల్ బిడ్స్‌ను ఓపెన్ చేస్తామన్నారు. టెండర్ ప్రాసెస్ పూర్తయిన అనంతరం పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపడతామన్నారు.

ఇద్దరు ఉపాధి ఉద్యోగుల సస్పెన్షన్

కర్నూలు(అగ్రికల్చర్): విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఉపాధి ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య మంగళవారం కౌతాళం, ఆస్పరి, కోసిగి తదితర మండలాల్లో పర్యటించి ఉపాధి పనులను తనిఖీ చేశారు. పీడీ మండలాల పర్యటనకు వచ్చినప్పుడు ఏపీఓలు, టీఏలు, ఇతర సిబ్బంది వెంట ఉండాలి. అయితే కౌతాళం ఏపీఓ బజారు, అస్పరి మండలంలో టెక్నికల్ అసిస్టెంటు రాజేంద్రలు లేకపోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. ఉపాధి పనులకు డిమాండ్ ఉన్న తరుణంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏపీవో బజారు, టెక్నికల్ అసిస్టెంట్ రాజేంద్రను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జాతీయ వైద్య కమిషన్ సభ్యులుగా డాక్టర్ చంద్రశేఖర్



కర్నూలు(హాస్పిటల్):జాతీయ వైద్య కమిషన్ మెడికల్ అడ్వయిజరీ కౌన్సిల్ సభ్యులుగా రాష్ట్రం తరపున కర్నూలుకు చెందిన డాక్టర్ పి.చంద్రశేఖర్‌ను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా ఉన్న ఆయనకు జాతీయ వైద్య కమిషన్ సభ్యులుగా నామినేట్ చేయడం పట్ల స్థానిక వైద్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మూడో రోజైన బుధవారం ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 11,064 మందికిగాను 10,656 మంది హాజరుకాగా 408 మంది గైర్హాజరయ్యారు. సెకండియర్ పరీక్షలకు 2,074 మందికిగాను 1,967 మంది హాజరుకాగా 107 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐఓ గురువయ్య శెట్టి తెలిపారు.

ఇద్దరు విద్యార్థులు డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం ఇద్దరు విద్యార్థులు చూచి రాతలకు పాల్పడుతూ డిబార్ అయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 59 పరీక్ష కేంద్రాల్లో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 8,435 మందికి 7,701 మంది హాజరు కాగా 734 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలకు 3,749మందికి 3,467 మంది హాజరు కాగా 282 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

ఎండదెబ్బ తగలకుండా చూసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో ప్రజలు ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల్లోపు తమ పనులు ముగించుకుని నీడగల ప్రదేశాల్లో ఉండాలని సూచించారు. ఎండలో తిరిగితే శరీరంలోని నీరు, లవణాలు చెమట రూపంలో ఆవిరై నీరసంతో వడదెబ్బకు గురవుతారని హెచ్చరించారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని త్వరగా నీడగల ప్రదేశానికి తీసుకెళ్లి గాలి తగిలేటట్లు చూడాలని సూచించారు. వీలైనంత త్వరగా దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాలని తెలిపారు.



రాయలసీమ ఆల్కలీస్ ఫ్యాక్టరీ

ఊ కొడతారా.. దెబ్బలు తింటారా!



టీజీ గ్రూపు ఆల్కలీస్ ఫ్యాక్టరీ విస్తరణపై ఏకపక్షంగా ప్రజాభిప్రాయ సేకరణ

- ఫ్యాక్టరీపై అభ్యంతరాలు చెప్పిన వారిపై భౌతిక దాడులకు దిగిన యాజమాన్యం
- డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ అధ్యక్ష, కార్యదర్శులపై విచక్షణారహితంగా దాడి
- వార్తలు కవర్ చేసేందుకు వెళ్లిన విలేకరుల మొబైల్‌ఫోన్లు లాగేసుకున్న భద్రతా సిబ్బంది
- తమకు అనకూలంగా మినిట్స్ నమోదు చేసి ప్రభుత్వానికి సిఫారసు
- ఫ్యాక్టరీకి అనుకూలంగా మినిట్స్ పంపేందుకు సిద్ధమైన అధికారులు

అనుకున్నట్లే జరిగింది. మంత్రి టీజీ భరత్ కుటుంబానికి చెందిన ఆల్కలీస్ ఫ్యాక్టరీ విస్తరణపై చేపట్టిన ప్రజాభిప్రాయసేకరణ పూర్తి ఏకపక్షంగా సాగింది. పక్కా స్క్రిప్ట్ ప్రకారం ఎవరు మాట్లాడాలి? ఏం మాట్లాడాలి? అని ముందే కొంతమందిని ప్రత్యేకంగా ఎంపిక చేసి వారితో అనుకూలంగా మాట్లాడించారు. ఎవరైనా అభ్యంతరాలు చెబితే వారిని భద్రతా సిబ్బంది లాక్కెళ్లి భౌతిక దాడి చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజాస్వామ్యయుతంగా ప్రజల అభిప్రాయాలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకునేందుకు చేపట్టిన ప్రజాభిప్రాయసేకరణ పూర్తి ఏకపక్షంగా, కంపెనీకి అనుకూలంగా చేపట్టారు. ప్రజాభిప్రాయసేకరణ సభ జరిగిన తీరును వామపక్షాలు, ప్రజా సంఘాలు తీవ్రంగా తప్పుబడుతున్నాయి.

కర్నూలు(రూరల్)/కర్నూలు(సెంట్రల్): రాయలసీమ ఆల్కలీస్ ఫ్యాక్టరీలో టెప్లాన్(పీటీఎఫ్ఈ) తయారీ పరిశ్రమ కోసం బుధవారం గొందిపర్లలో ప్రజాభిప్రాయసేకరణ సభ నిర్వహించారు. కాలుష్యనియంత్రణ మండలి ఈఈ కిషోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో ఆర్డీవో సందీప్‌కుమార్, తహసీల్దార్ రమేశ్‌బాబుతో పాటు యాజమాన్యం తరపున మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేశ్ పాల్గొన్నారు. సభలో 30మంది దాకా తమ అభిప్రాయాలు చెప్పారు. అయితే గొందిపర్లతో పాటు టీజీ వెంకటేశ్‌కు అనుకూలంగా ఉన్న వ్యక్తులు భారీ సంఖ్యలో సభకు హాజరయ్యారు. ఫ్యాక్టరీ నిర్మాణం, పీటీఎఫ్ఈ తయారీకి వాడే పీఎఫ్ఓఏతో కలిగే కాలుష్యం తదితర అంశాలపై కొన్ని రోజులుగా పలువురు శాస్త్రవేత్తలు, పౌరసంఘాలు, వామపక్షాలు ఆందోళన చేపడుతున్నాయి. ఈక్రమంలో వారెవ్వరినీ సభలోకి రాకుండా యజమాన్యం కట్టడి చేసింది. వచ్చిన కొద్దిమందిపై కూడా టీజీ ప్రైవేటు సైన్యం భౌతికదాడులు చేసి గెంటేసింది. కవరేజికి వెళ్లిన పత్రికా విలేకరుల సెల్‌ఫోన్లు సైతం లాక్కోవడం గమనార్హం. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, కార్యదర్శి నగేశ్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుంటే ప్రైవేటు సైన్యం, పోలీసులు వారిని అక్కడి నుండి లాక్కుని బయటకు తీసుకెళ్లారు. టీజీ ప్రైవేటు సైన్యం రాఘవేంద్ర గొంతుపై కాలుతో తొక్కేశారు. ఎండీ ఆనంద్‌బాబుపై పిడిగుద్దులు గుద్ది మొబైల్‌ఫోన్ కూడా లాక్కున్నారు. నగేశ్, రామకృష్ణను కూడా బయటకు లాగేసి విచక్షణా రహితంగా దాడి చేశారు. ఓవైపు ఆర్డీవో సందీప్‌కుమార్ మాట్లాడేందుకు అందరికీ అవకాశం ఇస్తామని చెబుతుంటే మరోవైపు టీజీ ప్రైవేటు సైన్యం ప్రజా సంఘాలు, వామపక్షాల ప్రతినిధులను విచక్షణారహితంగా లాక్కెళ్లి దాడి చేయడం గమనార్హం. ఇదంతా పోలీసుల సమక్షంలోనే జరుగుతున్నా వారు ప్రేక్షక పాత్ర పోషించడంతో పాటు ప్రైవేటు సైన్యానికి అనుకూలంగా వ్యవహరించారు. దీంతో ప్రజాసంఘాలు, వామపక్షాలు తీవ్ర ఆవేదనకు గురయ్యాయి. ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయసేకరణ జరుగుతుంటే కనీసం అభిప్రాయాలు వినేందుకు కూడా యాజమాన్యం అంగీకరించకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

జీవనోపాధి కోల్పోతాం

- కెమికల్ ఫ్యాక్టరీకి అనుమతులు ఇవ్వొద్దు



వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

రాయలసీమ ఆల్కలిస్ (ఎస్ఆర్ఏపీ) ఫ్యాక్టరీకి అనుబంధంగా రసాయనాల తయారీ పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వొద్దని అధికారులకు ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారులు సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్ వినతిప త్రం ఇచ్చారు. ఫ్యాక్టరీ చుట్టూ పది గ్రామాల్లో చేతివృత్తులపై ఆధారపడి జీవించే వారు జీవన ఉపాధి కోల్పోతారని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. టీజీవీ ఆల్కలిస్ ఫ్యాక్టరీలో బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కెమికల్ ఫ్యాక్టరీ వద్దని అధికారులకు పలువురు వినతిపత్రాలు అందజేశారు. ఇ.తాండ్రపాడు గ్రామాన్ని టీజీ వెంకటేష్ దత్తత తీసుకొని ధోబీఘాట్ నిర్మిస్తామని హామీ ఇచ్చి మూడు సంవత్సరాలు అవుతున్నా అమలు చేయలేదని గుర్తు చేశారు.

పీటీఎఫ్ఈ వాడకానికి వాడే రసాయనం ఏంటో స్పష్టత ఇవ్వని వైనం

పీటీఎఫ్ఈ తయారీకి పీఎఫ్ఓఏ వాడుతున్నారని శాస్త్రవేత్తలు, ప్రజా సంఘాలు, వామపక్షాలు కొద్దిరోజులుగా ఆందోళన చేస్తున్నాయి. అయితే టీజీ వెంకటేశ్ పీఎఫ్ఓఏ వినియోగించబోమని, దానికి ప్రత్యామ్నాయం వాడతామని మంగళవారం ప్రకటించారు. ప్రత్యామ్నాయంగా ఏ రసాయనం వాడతారో స్పష్టత ఇవ్వలేదు. బుధవారం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ఈ అంశంపై స్పష్టత ఇవ్వలేదు. ఏ రసాయనాలు వాడతారు? ఏ టెక్నాలజీ వాడతారు అనేది ప్రభుత్వానికి సమర్పించిన ఈఐఏ(పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక)లోనూ పేర్కొనలేదు. అసలు టెక్నాలజీ, ఏ రసాయనాలు వాడుతారో యజమాన్యానికి స్పష్టత లేకుండా, ప్రజలకు స్పష్టం చేయకుండా గోప్యంగా ఉంచాల్సిన అవసరమేంటని ప్రజాసంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వానికి నివేదిక

ప్రజాభిప్రాయ సేకరణలో మొత్తంగా 30మంది అభిప్రాయాలను కమిటీ సేకరించింది. దీని మినిట్స్‌పై నివేదికను కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వశాఖకు పంపనున్నారు. అధికారులు పూర్తిగా యజమాన్యానికి లొంగిపోయి నిజాలు దాచి వారికి అనుకూలంగా నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు వామపక్షాలు, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రజాభిప్రాయసేకరణ అప్రజాస్వామిక నిర్వహించడం, ప్రతినిధులపై దాడి చేయడాన్ని నిరసిస్తూ ప్రజాసంఘాల ఐక్య వేదిక, వామపక్షాల ఆధ్వర్యంలో నేడు కలెక్టర్ ఎదుట భారీ నిరసన చేపట్టనున్నట్లు ప్రజాసంఘాల ఐక్య వేదిక కన్వీనర్ రామకృష్ణ తెలిపారు. సభలో ప్రాతినిధ్యానికి అవకాశం కల్పించకపోవడం, విద్యార్థి, ప్రజా, యువజన సంఘాలపై దాడి చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. నిరసనకు ప్రజాస్వామ్య వాదులు తరలిరావాలన్నారు.

పోలీస్, రెవెన్యూ శాఖ అధికారుల సమక్షంలోనే దాడి

కాలుష్య కారకాలు వెదజల్లకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డీఓకు వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించా. ఇంతలోనే కర్నూలుకు చెందిన కొందరు గూండాలు నన్ను ఎత్తుకొని వెనుక వైపు తీసుకెళ్లారు. విచక్షణరహితంగా కొట్టారు. చివరకు కింద పడేసి గొంతుపై చెప్పుల కాళ్లతో తన్నారు. పోలీసులు చూసినా పట్టించుకోలేదు. ఇది ప్రజాస్వామ్యమా, లేదంటే టీజీ వెంకటేష్‌స్వామ్యమా. ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేసి మళ్లీ కలెక్టర్ సమక్షంలో నిర్వహించాలి.
– రాఘవేంద్ర, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

ప్రైవేట్ గూండాల మధ్య ప్రజాభిప్రాయ సేకరణా?

టీజీవీ గ్రూపు ఏర్పాటు చేయనున్న ప్రమాదకర పీటీఎఫ్ఈ, సీపీవీసీ పరిశ్రమ విస్తరణకు సంబంధించి బుధవారం గొందిపర్లలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ పూర్తిగా ప్రైవేట్ గూండాల కనుసన్నల్లో జరిగింది. ప్రజా సంఘాల నాయకులపై ప్రైవేట్ సైన్యం విచ్చలవిడిగా దాడి చేసింది. అభ్యంతరాలను ఇవ్వడానికి వెళితే తీసుకోకుండా దాడులు చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం కలుగజేసుకొని పరిశ్రమ విస్తరణను అడ్డుకోవాలి. లేదంటే పోరాటాలకు దిగుతాం.
– వై.నగేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

నా సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు

నేను నాకున్న అభ్యంతరాలను ఇవ్వాలని ముందుగానే సభకు వెళ్లాను. అయితే నన్ను కొందరు ప్రైవేట్ గూండాలు గుర్తించి మధ్యలో బయటకు లాక్కెళ్లి పడేశారు. అప్పుడే నా సెల్‌ఫోన లాక్కున్నారు. అందులో ఏమీ లేవన్నా వినలేదు. ఇంతవరకు నా సెల్‌ను ఎవరిని అడిగినా ఇవ్వడంలేదు. రేపు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తా. – ఎండీ ఆనందబాబు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి

లైసెన్స్ ఫీజు 20వ తేదీలోగా చెల్లించాలి



సమీక్షలో మాట్లాడుతున్న నోడల్ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి

కర్నూలు: జిల్లాలోని మద్యం దుకాణాల ఐదో విడత లైసెన్స్ ఫీజు ఈనెల 20లోపు చెల్లించేలా చూడాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నోడల్ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో నంద్యాల, కర్నూలు జిల్లాల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎక్సైజ్ స్టేషన్ల వారీగా నమోదైన నేరాలు, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, నాటుసారాను సమూలంగా నిర్మూలించేందుకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. కర్నూలు జిల్లాలో 40 శాతం గ్రామాలను నెలాఖరుకు సారా రహిత ప్రాంతాలుగా ప్రకటించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కర్నూలు జిల్లాలో 430 మంది, నంద్యాల జిల్లాలో 352 మంది పాత నేరస్థులు ఉన్నారని, వారందరినీ నెలాఖరు లోపు తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేయాలన్నారు. ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడి జైలుకు వెళ్లినప్పటికీ వృత్తిని మానుకోని వారిపై ఒక్కో స్టేషన్ పరిధిలో ఒకరిపై నెలాఖరులోపు పీడీ కేసులు నమోదు చేయాలన్నారు. నవోదయం 2.0 అమలులో భాగంగా సారా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కానిస్టేబుల్‌కు బీట్ పరిధిని నిర్ణయించి సారా నిర్మూలనకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ రావిపాటి హనుమంతరావు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కర్నూలు, నంద్యాల జిల్లాల అధికారులు మచ్చ సుధీర్ బాబు, రవికుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు రామకృష్ణారెడ్డి, రాముడు, రాజశేఖర్ గౌడ్‌తో పాటు ఉమ్మడి జిల్లాల ఇన్‌స్పెక్టర్లు సమావేశంలో పాల్గొన్నారు.

మూడు మండలాల్లో 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఒకవైపు అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండగా.. మరోవైపు అకాల వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వర్షాలు కురిసినా ఉష్ణోగ్రతలు మాత్రం తగ్గని పరిస్థితి. చాగలమర్రి, మిడుతూరు, నందికొట్కూరులలో 41.6 డిగ్రీలు, రుద్రవరంలో 40.9, బండిఆత్మకూరులో 40.6, అవుకులో 40.4, పగిడ్యాలలో 40.3, పాణ్యంలో 40 కోడుమూరులో 39.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా జిల్లాలో 11 మండలాల్లో అకాల వర్షాలు కురిశాయి. హొళగుందలో 17.2 మి.మీ, దేవనకొండలో 12.4, గోనెగండ్లలో 7.4, ఎమ్మిగనూరులో 7.2, పత్తికొండలో 6.2, కర్నూలు రూరల్‌లో 4.2 మి.మీ ప్రకారం వర్షపాతం నమోదైంది.

పాలిసెట్ ఫలితాల విడుదల

కర్నూలు సిటీ: ఏపీ పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాలను బుధవారం విడుదల చేశారు. కర్నూలు జిల్లా స్థాయిలో ఎ.తేజశ్వి రాష్ట్ర స్థాయిలో 231వ ర్యాంకు(జిల్లా స్థాయిలో ఫస్ట్ ర్యాంకు), దాసరి శృతి 250వ ర్యాంకు(జిల్లా స్థాయిలో 2వ ర్యాంకు), బి.చక్రిధర్ 322వ ర్యాంకు(జిల్లా స్థాయిలో 3వ ర్యాంకు)లు సాధించారు. అదే విధంగా నంద్యాల జిల్లాకు చెందిన కురువ సాత్విక్ రాష్ట్ర స్థాయిలో 43వ ర్యాంకు(జిల్లా ఫస్ట్ ర్యాంకు), ఎ.లీలాక్రిష్ణ రాష్ట్ర స్థాయిలో 92వ ర్యాంకు(జిల్లా స్థాయిలో సెకెండ్ ర్యాంకు), టి.వర్షితా బాయ్ రాష్ట్ర స్థాయిలో 176వ ర్యాంకు(జిల్లా స్థాయిలో థర్డ్ ర్యాంకు)లు సాధించారు. గత నెల 30న కర్నూలులో 12, ఆదోనిలో 10 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. కర్నూలు జిల్లా నుంచి బాలురు 4,395, బాలికలు 2,040 మంది మొత్తం 6,435 మంది హాజరుకాగా 6,074 మంది ఉత్తీర్ణులయ్యారు. నంద్యాల జిల్లా నుంచి బాలురు 3,464 మంది, బాలికలు 1,656 మంది మొత్తం 5,120 మంది హాజరుకాగా 4,824 మంది ఉత్తీర్ణులయ్యారు.

దాహం తీర్చేందుకు రూ.4.60 కోట్ల నిధులు

కర్నూలు(అర్బన్): వేసవి ప్రణాళికలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 29 మండలాల్లోని వివిధ గ్రామాల ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం రూ.4.60 కోట్ల నిధులను విడుదల చేసింది. కర్నూలు జిల్లాలోని 13 మండలాలకు రూ.2.34 కోట్లు, నంద్యాల జిల్లాలోని 16 మండలాలకు రూ.2.26 కోట్లను కేటాయిస్తూ పీఆర్అండ్ఆర్‌డీ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా గ్రామాల్లోని ప్రజల దాహార్తిని తీర్చేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం కోసం ఈ నిధులను వినియోగించుకోనున్నారు.

సీఎం పర్యటనలో మార్పు

- 17న కర్నూలు రానున్న ముఖ్యమంత్రి



సీక్యాంపు రైతుబజార్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్)/(అగ్రికల్చర్)/కల్లూరు/పాణ్యం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన మారింది. ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 17న పాణ్యంలో సీఎం పర్యటించాల్సి ఉంది. అయితే ఈ కార్యక్రమాన్ని కర్నూలుకు మార్చారు. దీంతో గత రెండు రోజుల నుంచి పాణ్యంలో ఉన్న అధికారులు ఏర్పాట్లను విరమించారు. ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొంటున్నారు. ఈ నెల 17న కర్నూలులో సీఎం పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కర్నూలులోని సీక్యాంపు రైతుబజార్‌లో జరిగే స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొంటారని, ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులు, ఇద్దరు రైతులతో మాట్లాడతారని తెలిపారు. అనంతరం కేంద్రీయ విద్యాలయం సమీపంలో ఏర్పాటు చేసే ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొంటారని, మూడు వేల మందికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అంతకముందు జిల్లా కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి రైతు బజార్, ప్రజా వేదిక ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించారు. ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి సీఎం పర్యటనను విజయవంతం చేద్దామన్నారు.

- స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమానికి జేసీ నవ్య ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సహాయకులుగా ఉంటారు. ప్రజావేదిక ఇన్‌చార్జిగా జెడ్పీ సీఈఓ వ్యవహరిస్తారు.

ధరల పతనం.. జీరో వ్యాపారం!

- మార్కెట్‌ఫీజు లేకుండానే సరిహద్దులు దాటుతున్న ధాన్యం
- ముడుపుల వసూళ్ల కోసం చెక్‌పోస్టుల్లో అనధికార వ్యక్తులు



రాత్రి సమయంలో ధాన్యం బస్తాలతో వెళ్తున్న లారీ

కర్నూలు(అగ్రికల్చర్): రైతులు పండించిన పంటలకు ధరలు పతనం కావడంతో వ్యాపారుల లాభం కోసం, స్వప్రయోజనాల కోసం కొన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలు జీరో వ్యాపారానికి గేట్లు ఎత్తాయి. ముడుపుల వసూళ్ల కోసం చెక్‌పోస్టుల్లో అనధికార వ్యక్తులను నియమించినట్లు విమర్శలు ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రబీలో సాగైన వరి నెల రోజుల నుంచి రైతుల ఇంటికి వస్తోంది. ధర లేకపోవడంతో రైతుల నుంచి ధాన్యాన్ని దళారులు, వ్యాపారులు కొనుగోలు చేసి 'జీరో' పై సరిహద్దులు దాటిస్తున్నారు. మార్కెట్ కమిటీ అధికారులకు ముడుపులు ముట్టచెబుతూ.. యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఆదాయం కోసం ఏ ఒక్క అవకాశాన్ని వదులు కోవడం లేదని, ఇందులో భాగంగానే ధాన్యం జీరోపై తరలించేందుకు గేట్లు తెరిచారనే విమర్శలు వస్తున్నాయి.

వ్యాపారుల అక్రమాలు ఇలా..

ధాన్యం క్రయవిక్రయాలపై 2 శాతం మార్కెట్ ఫీజు చెల్లించాల్సి ఉంది. రైతులే స్వంతంగా ఇతర ప్రాంతాల్లో విక్రయించుకోవడానికి తరలిస్తే ఎటువంటి ఫీజు ఉండదు. వ్యాపారుల నుంచి మాత్రమే ఫీజు వసూలు చేస్తారు. ధాన్యం క్వింటాలు ధర రూ.2,000 వరకు ఉంటోంది. లారీ సామర్థ్యాన్ని బట్టి 300 క్వింటాళ్ల వరకు లోడ్ చేస్తారు. లారీ ధాన్యం విలువ రూ.6 లక్షలు ఉంటుంది. నిబంధనల ప్రకారం 2 శాతం ప్రకారం రూ.12 వేలు మార్కెట్ ఫీజు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో ఎక్కడైనా సరే ఒక్కచోట ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. వ్యాపారులు లారీకి రూ.12 వేలు ఫీజు చెల్లించడం మనసొప్పక మార్కెట్ కమిటీ అధికారులకు ముడుపులు ఇచ్చుకొని తరలిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అక్కడక్కడ ముడుపుల కింద రూ.6000 పోయినా రూ.6000 మిగులు ఉంటుందనేది వ్యాపారుల ఉద్దేశం.

కర్ణాటకకు తరలుతున్న ధాన్యం...

పాణ్యం, నంద్యాల, శిరువెళ్ల, రుద్రవరం, బండిఆత్మకూరు తదితర మండలాల్లో పండించిన ధాన్యం కర్ణాటక రాష్ట్రానికి తరలుతోంది. ప్రధానంగా కర్ణాటకలోని సిరుగుప్పకు వెళ్తున్నట్లు సమాచారం.హైదరాబాద్‌కు కూడా కొంతమేర ధాన్యం వెళ్తోంది. ప్రధానంగా రాత్రి వేళల్లోనే రోజుకు 20 నుంచి 30 లారీల వరకు ధాన్యం ఎలాంటి మార్కెట్ ఫీజుల చెల్లించకుండా వెళ్తోంది. పాణ్యం, కర్నూలు మార్కెట్ కమిటీలకు చెందిన చెక్‌పోస్టుల్లో ఎక్కడో ఒక చోట మార్కెట్ ఫీజు వసూలు చేయాల్సి ఉన్నా.. మామూళ్లు తీసుకుంటున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కర్నూలులోని చౌరస్తా చెక్‌పోస్టులో అనధికార వ్యక్తిని నియమించి ముడుపులు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రత్యేక దృష్టి సారించాం

మార్కెట్ ఫీజు ఫీజు చెల్లించకుండా వ్యాపారులు ధాన్యాన్ని జిల్లా సరిహద్దు దాటించకుండా ప్రత్యేక స్క్వాడ్‌ల ఏర్పాటు చేశాం. జీరో వ్యాపారం నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాం. – నారాయణమూర్తి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

క్లుప్తంగా

భర్త వేధింపులు తాళలేక ..

● పోలీసులను ఆశ్రయించిన వివాహిత

పగిడ్యాల: ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త రోజూ చిత్రహింసలకు గురి చేస్తుండడంతో ఓ వివాహిత బుధవారం ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. బాధిత మహిళ తెలిపిన వివరాల మేరకు.. పడమర వనుముల పాడు గ్రామానికి చెందిన యాస్మిన్, అదే గ్రామానికి చెందిన మజీద్ పదిహేనేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి 13 ఏళ్ల కూతురు ఉంది. అయితే కొన్నాళ్లుగా తన అత్త వేధిస్తుందని, మగ బిడ్డ పుట్టలేదని, కుమారుడికి మళ్లీ పెళ్లి చేస్తానని భయపెడుతుంది. అలాగే పుట్టింటి నుంచి కట్న కానుకలు తేవాలని రోజు అత్త చిత్రహింసలు పెడుతోంది. దీనికి తోడు భర్త కూడా తాగుడుకు బానిసై శారీరకంగా, మానసికంగా చిత్రహింసలు పెడుతుండటంతో యాస్మిన్ నెల రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. తన భర్త అక్కడికి వచ్చి తన కుటుంబీకులను దుర్భాషలాడుతున్నాడని బాధితురాలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

డ్రోన్‌లకు అంత మొత్తం చెల్లించలేం

● మొండికేసిన ఎఫ్‌ఎంజీ కిసాన్ డ్రోన్ గ్రూపులు

కర్నూలు(అగ్రికల్చర్): యూనిట్ కాస్ట్ ఎక్కువగా ఉండటంతో తమ వాటా మొత్తాన్ని ఒకేసారి చెల్లించలేమని ఎఫ్‌ఎంజీ కిసాన్ డ్రోన్ గ్రూపులు మొండికేశాయి. వ్యవసాయ శాఖ సరఫరా చేస్తున్న డ్రోన్‌లకు 80 శాతం సబ్సిడీ ఉంది. డ్రోన్ యూనిట్ కాస్ట్ రూ.9.81 లక్షలు. డ్రోన్ పొందాలంటే యూనిట్ కాస్ట్‌లో 50 శాతం(రూ.4.90 లక్షలు) ముందుగా చెల్లించాల్సి ఉంది. జిల్లాకు 40 డ్రోన్‌లను వ్యవసాయ శాఖ కేటాయించింది. ఇప్పటికే 31 కిసాన్ గ్రూపులకు డ్రోన్‌లు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ పరిపాలన అనుమతులు ఇచ్చారు. డ్రోన్‌లు గ్రౌండింగ్ కావాలంటే ముందుగా గ్రూపు యూనిట్ కాస్ట్‌లో 50 శాతం చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు ఒక్క గ్రూపు మాత్రమే ఆ మొత్తాన్ని చెల్లించింది. మిగిలిన గ్రూపులు ఈ మొత్తాన్ని చెల్లించేందుకు ముందుకు రాని పరిస్థితి. ఇదిలాఉంటే మంచి కంపెనీల డ్రోన్‌లు బ్యాటరీలతో సహా రూ.8 లక్షలకే వస్తున్నాయి. ప్రభుత్వం సరఫరా చేసే డ్రోన్‌ల ధర దాదాపు రూ.10 లక్షల వరకు ఉండటం పట్ల గ్రూపులు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కర్నూలు: కర్నూలు నగరం గాంధీ నగర్‌లోని శరణ్య ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న గంట్ల శివ(20) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వెల్దుర్తి మండలం శ్రీరంగాపురం గ్రామానికి చెందిన జయరాముడు గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. ఈయన ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడు గంట్ల శివ ఇంటర్ వరకు చదువుకుని ఇటీవల అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లోని జ్యోతి మాల్‌లోని ఉత్సవ్ రెస్టారెంట్‌లో వెయిటర్‌గా చేరాడు. అందులో పని చేసే మరికొందరితో కలసి శరణ్య ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నాడు. మంగళవారం రాత్రి అపార్ట్‌మెంట్ పైనుంచి రోడ్డుపై పడి కాళ్లు, చేతులు విరిగాయి. అతనితో పాటు అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నవారు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న తండ్రి జయరాముడు ఆసుపత్రికి చేరుకుని కుమారుని మృతిపై అనుమానం వ్యక్తం చేశాడు. జ్యోతి మాల్ ఉత్సవ్ రెస్టారెంట్ మేనేజర్ మహమ్మద్‌తో పాటు శ్రీనివాసులు, హరి, శివకృష్ణ, రఫీలే తమ కుమారుని మృతికి కారణమని అనుమానం వ్యక్తం చేస్తూ రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యో పాపం

● తొమ్మిది రోజుల క్రితం మిద్దె కూలి భర్త మృతి
● భర్త మరణాన్ని జీర్ణించుకోలేక భార్య ఆత్మహత్య
● అనాథగా మిగిలిన 45 రోజుల చిన్నారి



అనాథగా 45 రోజుల చిన్నారి

ఉయ్యాలవాడ: విధి ఆటలో ఓ చిన్నారి అనాథగా మారింది. అభంశుభం తెలియని పసిపాప తొమ్మిది రోజుల వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోయింది. ఈ విషాద ఘటన ఆర్. పాంపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పాగాకు నారాయణ కూలీ పనులకు వెళుతూ జీవనం కొనసాగించేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 6వ తేదీన గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి చెందిన మట్టి మిద్దె పనులకు వెళ్లాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తూ మిద్దె కూలి శిథిలాలు నారాయణపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి నుంచి అతని భార్య లలిత (40) తీవ్ర మనోవేదనకు గురైంది. మనస్తాపంతో వారం రోజులుగా ఆహారం తీసుకోకుండా భర్త గురించే ఆలోచించింది. తన 45 రోజుల చిన్నారికి కూడా పోతపాలు తాపింది. చివరకు జీవితంపై విరక్తి చెంది బుధవారం ఉదయం లలిత రసాయన పౌడర్‌ను నీళ్లలో కలుపుకుని అపస్మారక స్థితిలో పడిపోయింది. గమనించిన బంధువులు, స్థానికులు చికిత్స నిమిత్తం 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో లలిత మృతి చెందింది. తల్లిదండ్రుల మృతి చెందడంతో 45 రోజుల చిన్నారి అనాథగా మిగిలింది. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పసిపాపకు తల్లిదండ్రులు లేకపోవడంతో నాయనమ్మ శివమ్మ దిక్కైంది. అమ్మపాల కోసం ఏడుస్తున్న చిన్నారిని చూసి పలువురు కంటతడి పెట్టారు. కాగా నారాయణ మొదటి భార్య విజయలక్ష్మి ఐదేళ్ల క్రితం కుటుంబ కలహాలతో క్రిమి సంహారక మందు తాగి మృతి చెందింది. రెండేళ్ల క్రితం లలితను రెండవ వివాహం చేసుకున్నాడు. మృతురాలి తల్లి నారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



మృతి చెందిన లలిత (ఫైల్)



ప్రమాదంలో మృతి చెందిన నారాయణ (ఫైల్)

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్..

ఇటీవల జిల్లాలో పలువురు ఆత్మహత్యకు కల్లాపికి ఉపయోగించే పేడ రంగును నీళ్లలో కలుపుకుని తాగి మృతి చెందుతుండటంతో కలెక్టర్ రాజకుమారి నెల క్రితం పేడ రంగు విక్రయాలను నిషేధించారు. అయినా కొందరు కిరాణ దుకాణ వ్యాపారులు విక్రయిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పేడ రంగు విక్రయించకుండా అధికారులు దుకాణాలపై దాడులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సెలవులకు వెళ్లి.. విగతజీవులుగా తిరిగొచ్చి!

● మల్లేపల్లె చెరువు మృతుల్లో ఇద్దరు పెద్ద బోధనం చిన్నారులు
● కుమారుల మృతితో శోకసంద్రంలో తల్లిదండ్రులు



మృత దేహాల వద్ద రోదిస్తున్న కుటుంబీకులు, బంధువులు



మృతి చెందిన సోదరులు సుందరి వెంకట చరణ్, వెంకట పార్థు (ఫైల్)

చాగలమర్రి: వేసవి సెలవుల్లో అమ్మమ్మ ఊరిలో సరదాగా గడిపేందుకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు విగతజీవులుగా తిరిగివచ్చారు. వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారి మఠం మండలం మల్లేపల్లె గ్రామంలో మంగళవారం చెరువులో పడి ఐదుగురు విద్యార్థులు మృత్యువాత పడిన విషయం విదితమే. ఐదుగురులో ఇద్దరు చాగలమర్రి మండలం పెద్ద బోధనం గ్రామానికి చెందిన చిన్నారులు ఉండటంతో గ్రామంలో విషాదం నెలకొంది. పెద్దబోధనం గ్రామానికి చెందిన సుందరి పాపన్న, నారాయణమ్మ దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు వెంకటసుబ్బయ్యకు బ్రహ్మంగారి మఠం మండలం మల్లేపల్లికి చెందిన వెంకట భవానితో వివాహమైంది. వెంకట సుబ్బయ్య హోంగార్డుగా పని చేస్తూ హైదరాబాదులో నివాసముంటున్నాడు. వీరికి వెంకట చరణ్(15), వెంకట పార్థు(13) కుమారులు కాగా అక్కడే చదువుతున్నారు. ఎంతో అల్లారుముద్దగా చూసుకుంటున్న కుమారులను వెంకట సుబ్బయ్య వేసవి సెలవుల నేపథ్యంలో రెండు రోజుల క్రితం అమ్మమ్మ ఊరు మల్లేపల్లెలో వదిలేసి వెళ్లాడు. కాగా మంగళవారం సాయంత్రం ఇద్దరు చిన్నారులు మరో ముగ్గురుతో కలసి గ్రామ చెరువులో ఈతకొట్టేందుకు వెళ్లారు. అయితే ప్రమాదవశాత్తూ చెరువులో మట్టి కోసం తవ్విన లోతైన గుంతల వైపు వెళ్లి ఐదుగురు నీట మునిగి మృత్యువాత పడ్డారు. ప్రొద్దుటూరు ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బుధవారం ఉదయం కుటుంబీకులకు అప్పగించారు. వెంకట చరణ్, వెంకట పార్థు మృతదేహాలను స్వగ్రామమైన పెద్ద బోధనం గ్రామానికి తరలించారు. విగత జీవులుగా ఉన్న ఇద్దరు చిన్నారులను చూసి కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వేసవి సెలవులు తమ కుమారులకు శాశ్వత సెలవులుగా మారాయని తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఉద్యోగాల భర్తీలో అక్రమాలు

● జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పలువురు అభ్యర్థులు
● విచారణకు ఆదేశించిన కలెక్టర్


కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇటీవల నిర్వహించిన ఉద్యోగాల భర్తీలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాకు ఈనెల 6న కర్నూలుకు చెందిన బద్రినాథ్, గంగాధర్, చంద్రప్ప, జ్యోతిబాయ్‌లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జనరల్ డ్యూటీ అటెండెంట్ సెలక్షన్ లిస్టులో 9వ నెంబర్‌లో ఉన్న అభ్యర్థి ఎంపికయ్యాడని, అయితే అతను గతంలో స్టడీ సర్టిఫికెట్లు నకిలీవిగా తేల్చి ఎంపిక రద్దు చేసి వెనక్కు పంపారని అభ్యర్థులు ఆరోపించారు. తిరిగి అదే వ్యక్తికి పోస్టింగ్ ఇచ్చారని తెలిపారు. జనరల్ డ్యూటీ అటెండెంట్ పోస్టుల సెలక్షన్ లిస్టులో రెండు ఎస్టీ పోస్టులు ఉండగా నిబంధనల ప్రకారం ఒకటి ఎస్టీ ఉమెన్‌తో భర్తీ చేయాలని, కానీ ఆ పోస్టును మగవారితో భర్తీ చేశారన్నారు. కొంతమంది మెడికల్ కళాశాల అధికారులు తమకు బాగా పరిచయం ఉందని చెప్పుకుంటూ అభ్యర్థుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి ఉద్యోగాలు వచ్చేలా చేశారని ఫిర్యాదు చేశారు. నియామకాల్లో ఎక్కువ శాతం నకిలీ సర్టిఫికెట్లు సమర్పించారన్నారు. ఈ విషయమై కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ వివరణ ఇస్తూ ఫిర్యాదులో పేర్కొన్న ఇద్దరు అభ్యర్థుల్లో ఒకరు ఉద్యోగంలో చేరలేదన్నారు. అభ్యర్థులను ఎంపిక చేసినా వారి స్టడీ సర్టిఫికెట్లపై సంబంధిత సంస్థలకు విచారణకు పంపిస్తామని, అక్కడి నుంచి నివేదిక వచ్చే వరకు వారికి జీతభత్యాలు ఉండవన్నారు.

నంద్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీపై అభియోగాలు నమోదు

● 11 నెలల్లో రూ.3.21 కోట్లు అదనంగా డ్రా
● మొత్తం 8 అభియోగాలు నమోదు

కర్నూలు(అగ్రికల్చర్): నంద్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ ఎం.కల్పనపై ప్రభుత్వం పలు అభియోగాలు నమోదు చేసింది. మార్కెటింగ్ శాఖలో డిప్యూటీ డైరెక్టర్ అయిన ఈమె ఆన్ డ్యూటీపై నంద్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. సెక్రటరీగా పని చేస్తూ అనేక అవకతవకలు, అక్రమాలకు పాల్పడ్డారు. ఈ అక్రమాలపై మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు విచారణ జరిపి నివేదికలు ఇచ్చారు. జాయింట్ డైరెక్టర్ విచారణలో పలు అక్రమాలు వెలుగు చూశాయి. నిబంధనల ప్రకారం 2023 ఏప్రిల్ నుంచి 2024 ఫిబ్రవరి వరకు అలవెన్స్‌లు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు తదితర వాటికి రూ.1.43 కోట్ల వరకు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉండగా.. రూ.3.21 కోట్లు అదనంగా ఖర్చు చేశారు. వివిధ రూపాల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆభియోగాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం ఎనిమిది అభియోగాలు నమోదు చేస్తూ ఎక్స్‌అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ జీవో ఆర్‌టీ నెంబరు 262 జారీ చేశారు.

పేదల బియ్యంలో పురుగులు



నంచర్లలో పంపిణీ చేసిన బియ్యంలో కనిపిస్తున్న తెల్లపురుగులు

చిప్పగిరి: నిత్యావసర సరుకుల పంపిణీలో భాగంగా ఈనెల నంచర్ల గ్రామంలో పేదలకు పంపిణీ చేసిన బియ్యంలో తెల్ల పురుగులు దర్శనమివ్వడంతో కార్డు దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు పంపిణీ చేసిన బియ్యంలో పురుగులు రావడంతో అధికారులను తీరును ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం పేదలకు నాణ్యమైన బియ్యం పంపిణీ చేయకుండా నాసిరకం బియ్యం ఏమిటని కార్డుదారులు నిలదీస్తున్నారు.

వెల్దుర్తిలో క్షుద్రపూజల కలకలం

● హైవే 44పై చెరుకులపాడు క్రాస్‌లో ఓ ఇల్లు కేంద్రంగా చేతబడి



క్షుద్ర పూజలు చేసిన దృశ్యం

వెల్దుర్తి: పట్టణంలోని కర్నూలు – బెంగళూరు జాతీయ రహదారి పక్కన చెరుకులపాడు క్రాస్ రోడ్డులోని ఓ ఇంట్లో క్షుద్రపూజలు చేసిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో కలకలం రేపుతున్నాయి. ఓ వ్యక్తి మీద చేతబడి ప్రయోగించినట్లుగా తెలుస్తోంది. ఇందుకు పట్టణానికి చెందిన వ్యక్తి సూత్రధారిగా ఉండి కొందరి ఫొటోలతో, భయానక చేతబడి చేస్తున్నప్పటి ఫొటోలు, వీడియోలు వైరల్‌గా మారాయి. సేకరించిన సమాచారం మేరకు.. పట్టణానికి చెందిన వ్యక్తి సిఫారసుతో చెరుకులపాడు క్రాస్ రోడ్డులోని ఓ ఇంటిని అద్దెకు తీసుకున్న వారు అందులో చేతబడులు చేస్తూ, గుప్తనిధుల వేటగాళ్లకు ఆసరాగా ఉంటున్నట్లుగా తెలుస్తోంది. ఎమ్మిగనూరుకు చెందిన వ్యక్తికి అప్పు ఉండగా అప్పు ఎగ్గొట్టేందుకు ఏకంగా ఆ వ్యక్తిపై చేతబడి ప్రయోగం చేసినట్లు సమాచారం. ఇందులో పట్టణానికి చెందిన పంచాయతీ కార్యాలయంలో అనధికారికంగా పనిచేస్తున్న కార్మికుడి ఫొటో ఉంది. ఇటీవల ఉలిందకొండకు చెందిన వ్యక్తిపై కూడా ఇక్కడి నుంచే చేతబడి ప్రయోగం చేసినట్లుగా తెలుసుకున్న ఉలిందకొండ వారు ఈ ఇంటికి చేరుకుని ఇంట్లో ఉన్నవారితో గొడవ పడినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా ఈ ఇళ్ల కేంద్రంగా రెండు నెలల పాటు మండలం వ్యాప్తంగా గుప్తనిధుల వేట కొనసాగినట్లుగా సైతం తెలుస్తోంది. పోలీసులకు సైతం సమాచారం అందినా చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది.

కాంగ్రెస్ నేత హత్య కేసులో మరో ఏడుగురి అరెస్టు



లక్ష్మీనారాయణ హత్యకేసు నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ హుసేన్ పీరా

ఆలూరు రూరల్: ఆలూరు కాంగ్రెస్ ఇన్‌చార్జ్, రాయలసీమ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ హత్యకేసులో మరో ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మేకల శ్రీనివాసులు, సారాయి పెద్దన్న, బోయ గోవిందు, బోయ రాము, వడ్డే నవీన్, జీర్ల ధనుంజయ, దొడ్ల మనోహర్‌లను బుధవారం ఉదయం అనంతపురం జిల్లా గుంతకల్లు–బళ్లారి రహదారిలోని విడపకల్లు వద్ద ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కర్నూలు జిల్లా ఏఎస్పీ హుసేన్ పీరా ఆధ్వర్యంలో పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, సీఐ రవి శంకర్ రెడ్డి, చిప్పగిరి, ఆలూరు, హొళగుంద ఎస్‌ఐలు శ్రీనివాసులు, మహబూబ్ బాషా, దిలీప్ కుమార్‌లతో కలిసి బుధవారం ఆలూరులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నిందితుల వివరాలు వెల్లడించారు. గత నెల 27వ తేదీన గుంతకల్లు సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద ఆలూరు కాంగ్రెస్ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ కారును లారీతో ఢీకొట్టి వేటకొడవళ్లతో నరికి చంపారన్నారు. ఓ భూ వివాదంలో లక్ష్మీనారాయణ కలుగచేసుకుని గౌసియా, పెద్దన్న, గుమ్మనూరు నారాయణపై ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఇరికిస్తామని బెదిరించాడన్నారు. దీంతో ముగ్గురు కలిసి లక్ష్మీనారాయణను అంతమొందించారన్నారు. ఈ కేసు విచారణలో భాగంగా మొదట 14 మందిపై కేసు నమోదు చేశామన్నారు. ఇందులో ఇప్పటికే బేపర్ గౌసియా, రాజేష్, సౌభాగ్యలను ఈ నెల 2వ తేదీ అరెస్టు చేసి రిమాండ్ తరలించామన్నారు. అనంతరం కోర్టు అనుమతితో వారిని కస్టడీలోకి తీసుకుని విచారించామన్నారు. ఈ మేరకు అదుపులో తీసుకున్న ఏడుగురు లక్ష్మీనారాయణను హత్య చేసినట్లు చెప్పారు. అలాగే గుమ్మనూరు నారాయణ ప్రమేయం ఉండడంతో మంగళవారం ఆయన్ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. దీంతో ఈ హత్యకేసులో 15 మందిపై ఎఫ్‌ఐఆర్ నమోదు అయ్యిందన్నారు. కాగా లక్ష్మీనారాయణ కుమారుడు వినోద్ ఫిర్యాదు మేరకు వైకుంఠం ప్రసాద్, వైకుంఠం మల్లికార్జున, మల్లేష్, చికెన్ రామాంజిలపై కేసు నమోదు చేయగా విచారణలో వారి ప్రమేయం లేదని తేలిందన్నారు. హత్య కేసులో ఇంకా ఎవరిదైనా పాత్ర ఉందని బాధితులు ఆధారాలతో నిరూపిస్తే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హుసేన్ పీరా విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

దూడను కాపాడారు





బావిలో నుంచి ఆవుదూడను పైకి తీసుకొస్తున్న దృశ్యం

నీటి కోసం వెళ్లి ప్రమాదవశాత్తూ బావిలో పడిన ఆవు దూడను అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. ఆత్మకూరు పట్టణంలోని రహమత్‌నగర్ శివారులో రైతు ఖాదర్ తన పొలంలో ఆవుల మందను నిలిపాడు. మందలో ఓ దూడ నీటి కోసం సమీపంలోని బావి వద్దకు వెళ్లి అందులో పడిపోయింది. గమనించిన ఆవుల కాపరులు బయటకు తీసేందుకు ప్రయత్నించి విఫలయ్యారు. వెంటనే రైతు ఖాదర్ బైక్‌పై ఆత్మకూరు అగ్నిమాపక కేంద్రానికి చేరుకుని జరిగిన విషయాన్ని చెప్పాడు. హుటాహుటిన అగ్నిమాపక కేంద్రం అధికారి భీముడునాయక్, హోంగార్డు శ్రీనివాసులు, సిబ్బంది గౌస్, మోహన్‌రాజులు ఫైరింజన్‌తో ఘటనా స్థలానికి చేరుకున్నారు. హోంగార్డు బావిలోకి దిగి దూడకు తాళ్లు కట్టి అతి కష్టం మీదకు పైకి చేర్చారు. ఆవు దూడను కాపాడిన అగ్నిమాపక సిబ్బందిని పట్టణ ప్రజలు అభినందించారు.

– ఆత్మకూరు



నిర్వహణలేక శిథిలమైన శుశ్రుతభవన్

భూత్‌బంగ్లా నిండా సమస్యలే!

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో భూత్‌బంగ్లాగా పిలవబడే శుశ్రుతభవన్ శిథిలావస్థకు చేరుకుంటోంది. నిర్వహణ లేక ఆ భవనం ఎక్కడికక్కడ పెచ్చులూడుతోంది. భవనానికి ఉన్న కిటికీలు సైతం ఊడిపోతున్నాయి. బాత్‌రూమ్‌లకు ఉన్న వెంటిలేటర్లు ఊడిపోయాయి. బాత్‌రూమ్‌ల్లో కాలుపెడితే ఎక్కడ జారిపడతామోనన్న విధంగా ఉన్నాయి. ఈ భవనంలో కింది భాగంలో ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, పై అంతస్తులో ఈఎన్‌టీ, ప్లాస్టిక్ సర్జరీ, జనరల్ సర్జరీ విభాగాలు ఉన్నాయి. దీంతో పాటు ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేశారు. ఈ భవనం నిర్వహణ సరిగ్గా లేకపోవడం, భవనం పాతది కావడంతో ఎక్కడ చూసినా సమస్యలు దర్శనమిస్తున్నాయి. వీటిని చూసి ఎప్పుడో కాదు..ఇప్పుడు ఇది భూత్‌బంగ్లాగా కనిపిస్తోందని వైద్యులు, రోగులు, వారి సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ భవనం నిర్వహణపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DMLT ADMISSIONS

■ DMLT 2 సంవత్సరముల కోర్సునకు అడ్మిషన్లు జరుగుచున్నవి. Q: ఇంటర్ పాస్ (ఏ గ్రూప్ అయిన) అర్హులైన వారికి స్కాలర్ షిప్ కలదు. # SEEDS కాలేజ్, కమలానగర్, అనంతపురం. సెల్: 9100494926, 9440255034. [A-1617]

REAL ESTATE

FLAT FOR SALE

■ కల్లూరు ఎస్టేట్, సుఖీభవ హాస్పిటల్ దగ్గర LAR అపార్టుమెంట్ గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2BHK ఫ్లాట్ 38 లక్షలకు కార్ పార్కింగ్‌తో కలిపి ఫ్లాట్స్ అమ్మబడును. సెల్: 9441540658. [SCA25003571]

SERVICES

FOR SALE

■ రన్నింగ్ హోటల్ సామాన్లు అమ్మబడును. అన్ని వంట పాత్రలు, స్టవ్స్, ఫ్రిజ్‌లు, టేబుల్స్ విత్ చైర్స్, సోఫా సెట్స్, క్యాటరింగ్ వంట సామాన్లు, టీ స్టాల్, LED లైట్స్, సైడ్ ఫ్యాన్స్, డెకరేషన్ లైట్స్ మొ॥. ఈ సామాన్లతో కొత్త రెస్టారెంట్ ప్రారంభం చేయటానికి అనుకూలం. సంప్రదించండి: 73307 00908. [SCA25003640]

HEALTH CARE

■ విశ్వభారతి హాస్పిటల్, కర్నూలు వారి ప్రముఖ వైద్యులు డా॥ పీటర్ ప్రవీణ్ (కార్డియాలజీ & పల్మనాలజీ) & డా॥ హితేష్ రెడ్డి (కార్డియాలజీ) గారి ఆధ్వర్యంలో ప్రతి గురువారం ఉ॥ 10.00 గం॥ల – మ॥ 2.00 గం॥ల వరకు గుండె మరియు ఊపిరితిత్తుల సమస్యల కొరకు అందుబాటులో గలరు. సంప్ర: 90329 99565. అడ్రస్: గురవయ్యశెట్టి గారి హాస్పిటల్, Opp: ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్, నందికొట్కూరు. [L-779132]

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : ✆ 73821 14647. [V-6726]

WANTED

■ మీ ఇంటివద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మెసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801 [SCA25003570]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12,000/–. సంప్ర : 95507 45296 [V- 6722]

■ కష్టమైన్నీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406 [HA-590]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18k Ph: 9160900024, 9640400073 [SCA25003536]

■ Wanted Accounts Executive to work a reputed company at Guntur. Mini.2 to 3yrs. Experience in tally Cont: 9133399257. [G-065]

■ WALK IN INTERVIEW-Medical Representative H.Q. Kurnool, Anantapuram, Tirupati, Vijayawada, Nellore Qly: Any Graduation or D.Pharmacy. Ph: 8919730457 [SCA25003633]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
70750 09185
70750 09165

ఇద్దరు సారా తయారీదారుల అరెస్ట్



పట్టుపడిన సారా బిందెలతో ఎక్సైజ్‌శాఖ అధికారులు

నందికొట్కూరు: నాటు సారా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నందికొట్కూరు పట్టణంలో జగనన్న కాలనీలో సారా తయారీ చేస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు సిబ్బందితో దాడి చేశారు. మంగలి శ్రీనివాసులు ఇంటిలో 132 లీటర్ల నాటు సారా లభించడంతో సీజ్ చేసి, 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. శ్రీనివాసులు ఇంటిని షికారి రవి, షికారి నానా సింగ్, షికారి భారతి అద్దెకు తీసుకుని సారా తయారు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. మంగలి శ్రీనివాసులను, షికారి రవిని అరెస్టు చేసి చేసి రిమాండ్‌కు తరలించారు. నానా సింగ్ పరారీలో ఉన్నాడని, సారా కేసులో ఇప్పటికే షికారి భారతి జైల్లో ఉందని సీఐ తెలిపారు. అలాగే వీరికి నాటు సారా తయారీకి బెల్లం సరఫరా చేసిన నందికొట్కూరు షికారి కాలనీకి చెందిన షికారి రవి మీద కూడా కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ జఫ్రుల్లా, హెడ్ కానిస్టేబుల్ శంకర్ నాయక్, పద్మనాభం, కుమారి, కానిస్టేబుళ్లు మధుసూదన్, ప్రసాద్, శివన్న విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ మాధవస్వామి, విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో శ్రీశైలం సీఐ, సిబ్బంది

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు మహిళల వద్ద 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు తెలిపారు. బుధవారం సాధారణ తనిఖీల్లో భాగంగా శ్రీశైలం టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా శ్రీశైలానికి చెందిన బీబీ, పిక్కిలి రేణుక సున్నిపెంట నుంచి ఆర్టీసీ బస్సులో 50 మద్యం సీసాలు తీసుకుని వస్తుండగా తనిఖీలో దొరికారన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. క్షేత్రంలో దేవదాయచట్టం ప్రకారం ఎవరైనా మద్యం సేవించకూడదని, అలాగే మద్యం కూడా కలిగి ఉండకూడదని సీఐ హెచ్చరించారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు రఘునాథుడు, బాలకృష్ణ, బలోజానాయక్, నానునాయక్, వెంకటనారాయణ, కృష్ణవేణి, దేవస్థాన హోంగార్డులు కిరణ్, దొరబాబు పాల్గొన్నారు.

నాగలదిన్నె వద్ద తుంగభద్ర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు



అక్రమ రవాణా.. అడ్డుకుంటే ఒట్టు!

నందవరం: అధికార దర్పానికి తల వంచారో లేక మామూళ్ల మత్తుకు చేతులు ముడుచుకున్నారో? ఏమో? ఇక్కడ అధికారుల కళ్లెదుటే ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. అడ్డదిడ్డంగా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నా అధికారులు పల్లెత్తు మాట అనడం లేదు. మచ్చుకు అభ్యంతరం కూడా చెప్పడం లేదు. నది నుంచి ఇసుకను తోడేస్తున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కుర్చీలకు పరిమితమై నిర్లక్ష్యపు నీడలో నిద్దరోతున్నారు. మండలంలోని నాగలదిన్నె, నదికైరవాడి గ్రామాలను అనుకొని ఉన్న అడ్డదారుల్లో పచ్చముకలు మాఫియాగా ఏర్పడి తుంగభద్ర నదిపై వాలిపోతున్నారు. పట్టపగలు ట్రాక్టర్లతో ఇసుకను యథేచ్ఛగా దోచుకెళుతున్నారు. అక్రమ రవాణాతో విసుగెత్తిన గ్రామస్తులు ఎన్నోసార్లు రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలకు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం. ఆ రెండు గ్రామాల స్థావరాల నుంచి రోజుకు 50 నుంచి 100 ట్రిప్పుల వరకు ఇసుక అక్రమంగా తరలిపోతున్నా ఇక్కడి అధికారులు మాత్రం అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ తీరు మార్చుకొని ఇసుక మాఫీయాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.